

6 నుంచి ఆధార్ అప్‌డేట్ శిబిరాలు

ఆదిలాబాద్(తాంసి), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 6వ తేదీ నుంచి పలుచోట్ల ఆధార్ సవరణ, నవీకరణ శిబిరాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా బీంపూర్, తాంసి, తలమడుగు, బోరజ్, జైనథ్, సాత్నాల మండలాల్లో ఇవి కొనసాగుతాయి. అయితే, ఏర్పాట్లపై కలెక్టర్ రాజార్షిషా శనివారం ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, మీ సేవా, ఆధార్ కేంద్రాల నిర్వాహకుల తో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆర్డీవో స్రవంతి, డీపీవో రమేష్, ఈడీఎం రవి, సెక్టోరల్ అధికారి రఘురమణ పాల్గొన్నారు.

వృద్ధుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలి

» శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఆరోగ్యంపై ఎప్పటికపుడు పర్యవేక్షణ ఉంచాలని, పిల్లలు ఇంట్లో పెద్దల పరిరక్షణ బాధ్యతను తీసుకోవాలని శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా సూచించారు. పట్టణంలోని వయోవృద్ధుల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ రజితలు వృద్ధులకు పలు పరీక్షలు జరిపి అవసరమైన మందులను అందజేశారు. అంతకుముందు వైద్య శిబిరాన్ని ప్రారంభించి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా మాట్లాడుతూ... వయోవృద్ధులు ప్రస్తుత వాతావరణం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆరోగ్యంపై దృష్టి సారించి అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు వారి తల్లిదండ్రుల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే, సీనియర్ సిటిజన్ కార్యవర్గ సభ్యులు గంగాధర్, రాం రాం కులకర్ణి, పళ్ల సత్యనారాయణ, శివన్న, నీలా కిషన్, భాస్కర్, జగదీశ్వర్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా


జైనథ్‌లో భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

కన్నులపండువగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం


పూజలు అందుకుంటున్న స్వామివారు

ఆదిలాబాద్(జైనథ్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రంగురంగుల పూలతో పాటు విద్యుత్ మోర్కురీ బల్బులతో అలంకరించారు. స్వామివారి విగ్రహాన్ని వివిధ పూలదండలు, పట్టువస్త్రాలతో పాటు బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. స్వామివారిని డప్పులు, భాజాల మధ్య పల్లకీలో ఊరేగించారు. స్థానిక ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి మహిళలు, భక్తులు, స్వామి దీక్ష భక్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక దీపం.. ఆధ్యాత్మిక రూపం

» శివాలయంలో సామూహిక దీపారాధన

ఇచ్చోడ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మహిళలు సామూహిక దీపారాధన చేశారు. కార్తీక దీపోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో శివాలయానికి కార్తీక శోభ వచ్చింది. ప్రతీ రోజు తెల్లవారుజామున మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని దీపాలంకరణ చేస్తూ శివనామ స్మరణ చేస్తున్నారు.

నేడు సోయా, మొక్కజొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నేరడిగొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మొక్కజొన్న, సోయాబీన్‌ల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సాబ్లే కిషోర్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే, మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ప్రారంభమైన సోయా కొనుగోళ్లు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో తడిసి దెబ్బతిన్న పంటలను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి ప్రారంభించారు. రూ.5328 మద్దతు ధరతో సోయా కొనుగోళ్లను ప్రారంభించారు. ముందుగా తూకం యంత్రాలకు ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం తొలిరైతును శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మద్దతు ధరతో పూర్తిస్థాయిలో సోయాబీన్ పంటను కొనుగోలు చేయాలని, ఇందుకు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా తోడ్పాటునందించాలన్నారు. ఆలస్యమైన మిగతా పంట పూర్తిగా కొనుగోలు జరపాలని సూచించారు.


కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్



రోడ్లు ఇలా.. రాకపోకలు ఎలా?

» ఉట్నూర్‌లో ఏజెన్సీలో గుంతలమయమైన రహదారులు

» ఎనిమిది కిలోమీటర్ల రోడ్డుపై ఎన్నో గుంతలు

» తరచూ ప్రమాదాలు.. అయినా పట్టింపు కరువాయే?

» టెండర్లు పిలుస్తున్నా.. ముందుకు రాని కాంట్రాక్టర్లు

సంక్షేమ.. కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం వద్ద నిధులు కొరత లేదని ప్రకటిస్తున్నా.. అభివృద్ధి పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతుండడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఉట్నూర్ ఏజెన్సీ కేంద్రం నుంచి కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా మారాయి. దీంతో నరకప్రాయంగా ప్రయాణాలు సాగుతున్నాయని ప్రజలు అంటున్నారు.

ఉట్నూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాలకులు శ్రద్ధ చూపక పోవడం వల్ల ప్రతీరోజు ఈ గుంతల రోడ్లపై రాకపోకలు సాగిస్తూ అనారోగ్యాలకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు మరింత అందుబాటులోకి వస్తాయని ప్రజలు భావిస్తుంటే.. ప్రభుత్వాలపై నమ్మకం లేక కాంట్రాక్టర్లు పనులు చేపట్టడానికి ముందుకు రావడం లేదు.

రోడ్డంతా గుంతలమయం

ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు నుంచి లింగోజితండా వరకు ఉన్న ఎనిమిది కిలోమీటర్ల రోడ్డుపై ఎన్నో గుంతలు ఏర్పడ్డాయి. ఫలితంగా ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను నాలుగు జిల్లాలుగా విభజించడం తో జిల్లాలోని ఉట్నూర్ మండలం లింగోజితండా, తుకారం ఎక్స్ రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వెళ్లే ప్రధాన రహదారి పైన ఎనిమిది కిలోమీటర్ల మేర హనుమాన్ ఘాట్ వరకు రోడ్డు అంతా గుంతలమయంగా మారింది. ప్రతినిత్యం వందలాది బస్సులు, లారీలు, కార్లు, జీపులు, ద్విచక్ర వాహనాలు, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఆదిలాబాద్‌కు రాకపోకలు కొనసాగుతుంటాయి. ఇంతేకాకుండా ఈ ప్రాంతం నుంచి మహారాష్ట్రకు వెళ్లే రోడ్డు ఉండడంతో సిమెంట్

గుంతల్లో ప్రయాణం.. నరకప్రాయం!!

లారీలు, భారీ వాహనాలు సైతం ఈ రోడ్డు గుండా నడుస్తున్నాయి. గత కొన్నేళ్లుగా జైనూరు నుంచి ఉట్నూర్ ఎక్స్‌రోడ్ వరకు రోడ్డుపై భారీగా గుంతలు పడ్డాయి. ప్రతీ నిత్యం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రజలు వివిధ పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా ఎత్తు పల్లాలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డుపై ప్రమాదాలకు గురవుతున్నారు. పలువురు యువకులు ద్విచక్ర వాహనాలతో జరిగిన ప్రమాదాలలో పదిహేను మంది వరకు మృత్యువాత పడ్డారు. అయినా అధికారులకు పట్టింపు కరువయ్యిందంటున్నారు.

మంచిర్యాల రోడ్డుపై గోస

ఉట్నూర్ నుంచి మంచిర్యాల వెళ్లే రహదారిపై ప్రయాణం నరకప్రాయంగానే ఉందంటున్నారు. ఉట్నూర్ నుంచి ఉడుంపూర్ వరకు కొత్తగూడెం, దంతనపల్లి వాగు వద్ద, బీర్సాయిపేట్ పెద్దచెరువు వద్ద, మూల మలుపు వద్ద, బీర్సాయిపేట గ్రామం వద్ద, అల్లంపల్లి ఎక్స్‌రోడ్డు సమీపంలో రోడ్లపైన భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేట్ బస్సు రోడ్డుపై ఉన్న గుంతలో దిగబడి టైర్ల రాడ్లు విరిగిపోవడంతో రోడ్డుపై రాత్రి 9గంటల ప్రాంతంలో బస్సు నిలిచిపోయింది. బస్సులో ఉన్న ప్రయాణికులతో పాటు ఇతర బస్సులలో ఉన్న ప్యాసింజర్లు రాత్రి వేళలో బస్సులు, ఇతర వాహనాలు అక్కడి నుంచి కదలలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరుసటి మధ్యాహ్నం వరకు ఈ ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు తప్పలేదు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించక పోవడంతో ప్రజలకు

(తరువాయి 6వ పేజీలో....)

ప్రమాదాల నివారణకు మరమ్మతులు అవసరం

: కుడిమెత తిరుపతి, రాష్ట్ర ఆదివాసీ సంఘం నాయకులు



ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టాలి. రోడ్లపై ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అన్ని శాఖల సమన్వయంతోనే అభివృద్ధి

» జిల్లాలోని ఆయా గ్రామాల్లో పర్యటించిన శిక్షణ అధికారుల బృందం » స్థానికంగా ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా

నేరడిగొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు సమగ్ర అభివృద్ధి దిశగా దూసుకుపోతాయని శిక్షణ అధికారులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కుమారి గ్రామంలో ఏఐఎస్, ఐఈఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, ఐఎస్ఎస్ శిక్షణ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. దీనిలో భాగంగా జడ్పీఎస్ఎస్, ఎంపీపీ పాఠశాలలు, అంగేఖివాడీ కేంద్రం, ఎఫ్‌పీ షాప్‌లో బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ స్థితి, తాగునీటి పథకాలు, సీసీ రోడ్ల పనులు, పోషక తోటలు, నర్సరీ ప్రాజెక్టులు, తదితర వాటిని ప్రత్యక్షంగా సందర్శించారు. గ్రామాభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు సమన్వయంతో చేపట్టిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా క్రీడా ప్రాంగణంలో గ్రామస్తులు చేపట్టిన శ్రమదానంలో శిక్షణాధికారులు పాల్గొని ప్రజలను ప్రోత్సహించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి అభివృద్ధి కార్యక్రమాలపై వారి సూచనలు చేశారు. వారి వెంట గ్రామస్థులు ఉన్నారు.

ఆదిలాబాద్(తాంసి): మండలంలోని ఆయా గ్రామాలలో ట్రైనీ కలెక్టర్లు ఆదివారం పర్యటించారు. బండల నాగపూర్, సవర్గావ్, గోట్కూరి గ్రామాలలో వీధివీధిల్లో ఇంటింటా తిరుగుతూ చేపడుతున్న పనులపై ఆరా తీశారు. వ్యవసాయం ఎలా చేస్తున్నారో? అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయో? లేవో? క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలు ఏ మేరకు కొనసాగుతున్నాయో? స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు పర్యటిస్తున్నారు.

ప్రభుత్వ పథకాల పనితీరు పరిశీలన

తలమడుగు: గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాల పనితీరును వాటి వివరాలను జిల్లాకు వచ్చిన శిక్షణ అధికారులు ఆదివారం తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో ట్రైనీ అధికారుల బృందం పర్యటిస్తూ నాలుగు రోజుల పాటు గ్రామంలోనే బస చేయన్నారు. మొదటిరోజు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న మౌలిక వసతులు గ్రామీణ ప్రాంత ప్రజల జీవన విధానం క్షేత్రస్థాయిలో ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి సర్వే నిర్వహించి ,ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. అదేవిధంగా గ్రామాల అభివృద్ధి కోసం ప్రజల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన ప్రతీఒక్కరు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిధులతో చేపట్టిన పనులు బాగున్నాయన్నారు. అదేవిధంగా గ్రామంలో అందిస్తున్న వైద్యం గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



కుమారి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శిక్షణ అధికారులు


తాంసిలో సంక్షేమ పథకాలపై ఆరా తీస్తూ..


సుంకిడి గ్రామంలో పర్యటిస్తూ..

అడుగుకో గుంత.. అవస్థల చెంత!!

నార్నూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిహత్నూరు నుంచి మన్యాపూర్ గ్రామం వరకు దాదాపు 3 కిలోమీటర్ల రోడ్డు అడుగడుగునా గుంతలు పడి దారుణంగా మారింది. ఈ రోడ్డు మార్గం గుండా ప్రయాణించాలంటే ప్రయాణికులు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు మార్గం గుండా రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే గుంతల్లో పడి దవాఖానాల పాలు కావాల్సిన దుస్థితి నెలకొంటుందని ప్రాంత ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతల మయంగా మారిన ఈ రోడ్డును బాగు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.


తాడిహత్నూర్-మన్యాపూర్ రోడ్డుపైన పెద్ద గుంతలు ఇలా..


బోథ్‌లో కోర్టు భవనం పనులను పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

కోర్టు భవన నిర్మాణ పనుల పరిశీలన

బోథ్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న కోర్టు భవనాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు భవనాన్ని సకాలంలో పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, బోథ్ న్యాయాధికారి పి.మౌనిక, భార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రావు దేశ్‌పాండే ప్రధాన కార్యదర్శి పి.శంకర్ అడిషనల్ ఎస్పీ సురేంద్రరావు, డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ఆర్డీవో స్రవంతి స్థానిక తహసీల్దార్ సుభాష్ చంద్ర, సీఐ గురుస్వామి, ఏపీపీ శ్రీధర్, న్యాయాధికారులు హరీష్‌ఠాకూర్, ఉపేందర్‌సింగ్, కుమ్మరివిజయ్, కుమార్‌చౌహాన్, తదితరులున్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

నేరడిగొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పశు పోశకులు పశువులకు ఉచిత గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలను వేయించుకోవాలని జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ గోపి కిషన్ అన్నారు. ఆదివారం మండలంలోని తేజాపూర్ గ్రామంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల వేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ సంచాలకుడు డాక్టర్ గోపి కిషన్ మాట్లాడుతూ గేదెలు, గోజాతి పశువులలో గాలికుంటు నివారణ టీకాలు వేయడంతో పాటు పశువులకు ఆధార్ చెవి పోగులను కూడా వేయడం జరుగుతుందన్నారు. సీజనల్ వ్యాధుల బారీన పడకుండా ఉండాలంటే టీకాలు కచ్చితంగా వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ జీవన్ రాథోడ్, పశువైద్య సిబ్బంది వెంకన్న, సురేష్, శివ, జంగుతో పాటు రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


తేజాపూర్‌లో టీకాలు వేస్తున్న జిల్లా సహాయ సంచాలకుడు గోపి కిషన్



విఠల్‌రుకుంబాయి ఉత్సవ విగ్రహాల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళా భక్తులు

ఘనంగా విఠల్‌రుకుంబాయి కల్యాణం

ఆదిలాబాద్(జైనథ్), నవంబర్2 (ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని లేఖర్‌వాడ గ్రామంలో ప్రతీ సంవత్రం మాదిరిగానే కార్తీకమాసంలో ఆదివారం స్థానిక విఠల్‌రుకుంబాయి ఆలయంలో కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రంగుల పూలతో పాటు వివిధ విద్యుత్ మోర్కురీ బల్బులతో అలంకరించారు. ఈ సందర్భంగా విఠల్‌రుకుంబాయి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, వివిధ ఆభరణాలతో అలంకరించి భాజాభజాలతో పల్లకిలో ఊరేగించారు. అనంతరం వేద పండితులు విఠల్‌రుకుంబాయి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి జోగురామన్న, ఆదిలాబాద్ మాజీ కౌన్సిలర్ చందనర్సింగ్, మాజీ సర్పంచ్ చందవిఠల్,నాయకులు డాక్టర్ భూమన్నలతో ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి పథకం

ఉట్నూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందుకుంటున్న పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని ఖానాపూర్ శాసన సభ్యుడు వెడమ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురికి మంజూరు అయిన సీఎం సహాయ నిధి చెక్కులను ఈ సందర్భంగా ఆయన పంపిణీ చేశారు. హాలీమా బేగంకు రూ.60 వేలు, ఉరగొండ వైష్ణవికి రూ.60వేల చెక్కులను అందజేశారు. బాధితులు ఎవరైనా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సహాయం కోరుకునే వారు తమ కార్యాలయంలో దరఖాస్తు సమర్పిస్తే మంజూరు చేస్తున్నామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ఇక్బాల్, మొహమ్మద్ జైనోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఆర్ఎస్ఎస్ పథ సంచలన్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దేశ హితమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పని చేస్తుందని ప్రాంత సహసేవ ప్రముఖ్ బలవత్రి గణేష్ అన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్ల పూర్తయిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం పథ సంచలన్ నిర్వహించారు. స్థానిక డైట్ మైదానం నుంచి ప్రారంభమైన పథ సంచలన్.. పట్టణ ప్రధాన వీధుల గుండా సాగింది. స్వయం సేవకులు ఘన వేషలో హాజరు కాగా.... వినాయక్ చౌక్, అశోక్ రోడ్, అంబేద్కర్ చౌక్, నేతాజీ చౌక్‌ల మీదుగా తిరిగి డైట్ మైదానానికి చేరుకుంది. ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పథ సంచలన్‌లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్య వక్తలు ప్రసంగించాం. కార్యక్రమంలో నగర సంచాలక్ కల్యాణ్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రధాన కూడళ్ల గుండా సాగుతున్న స్వయం సేవకులు

అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి

» జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రవికుమార్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ రూరల్), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్విమ్మింగ్ క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తూ వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా విశేష కృషి చేస్తామని జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు సాయిని రవికుమార్ తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాంద్రా గ్రామం శివారులోని ఒక్లె ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అబ్జర్వర్‌గా రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ కోశాధికారి కిరణ్ కుమార్ వ్యవహరించగా ఒలింపిక్ సంఘం బాధ్యుడు కోరెడ్డి పార్థసారథి, బీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, జిల్లా క్రీడల మండలి సూపరింటెండెంట్ సురేష్ కుమార్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. 2025- 29 గాను ఎన్నికలు జరగగా... అధ్యక్షుడిగా సాయిని రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా కొమ్ము కృష్ణ, ఉపాధ్యక్షులుగా లాలా మున్న, కోశాధికారిగా హరిచరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను శాలువా, పూలమాలలతో సన్మానించి అభినందనలు తెలిపారు. జిల్లాలో స్విమ్మింగ్ క్రీడా అభివృద్ధికి అసోసియేషన్ పాటు పడుతుందని అధ్యక్షుడు సాయిని రవికుమార్ తెలిపారు. క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తూ వారు అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపిన ఆయన స్విమ్మింగ్ క్రీడాకారులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి శాయశక్తులా కృషి చేస్తామని, ఆ దిశగా నూతన కార్యవర్గం పని చేస్తుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

రిటైర్డ్ ఉద్యోగులకు గ్రామస్థుల సన్మానం

తలమడుగు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగులు సత్రోజి ప్రసాద్, సుంకరి సురేష్‌లు 35 ఏళ్ల పాటు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో కండక్టర్లుగా అంకితభావంతో ప్రజాసేవలందించి, ఇటీవల అక్టోబర్ 31న పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, వారిని శాలువాలు కప్పి, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. దీర్ఘకాలంగా ప్రజా రవాణా రంగంలో విశేష సేవలందించిన వీరి కృషిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు చక్రధర్ రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, మురళి, సత్యనారాయణ, జూనియర్ లెక్చరర్ శ్రీనివాస్, అటవీ బీట్ అధికారి శరత్ రెడ్డి, రిమ్స్ ఉద్యోగి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్ వారసంతలో ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్న జనం

వారసంతలో ట్రా'ఫికర్'!!

ఉట్నూర్, నవంబర్2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న వారసంతలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి పై, పక్కనే ఉన్న ప్రత్యేక స్థలంలో వారసంత నిర్వహిస్తుండగా శివాజిచౌక్, జగ్జీవన్ చౌక్ ప్రాంతంలో ఆటోలు, జీపులు, ద్విచక్ర వాహనదారులు ఏకకాలంలో తిరుగుతుండడంతో ట్రాపిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కొంత మంది పండ్ల వ్యాపారులు రోడ్డుపైన తోపులు బండ్లు పెట్టి పండ్లు విక్రయిస్తూ.. ఉండడంతో ట్రాపిక్ సమస్య ఏర్పడుతుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ ముఖడే ఉత్తం

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తంలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ వారి ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మండలంలోని ఏమైయికుంట గ్రామ సమీపంలో మిథల్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోయాబీన్ మద్దతు ధర రూ. 5328 ఉందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏడీఎం గజానంద్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, సీసీఐ సీపీఓ నరేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి రాథోడ్ గణేష్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

ఉద్యోగ విరమణ సహజం : గజానంద్

నార్నూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగి ఉద్యోగ విరమణ సహజమేనని, విరమణ పొందిన వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.గజానంద్ నాయక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన జాదవ్ సుభద్రబాయి ఉద్యోగరీత్యా ఉపాధ్యాయురాలు టీడబ్ల్యూపీఎస్ పాఠశాల భీంపూర్‌లో విధులు నిర్వహిస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వారి స్వగృహంలో గ్రామస్తులు, నాయకులు, ప్రజాప్రతినిధులు కలిసి దంపతులను శాలువాలతో సన్మానించారు.



మంచిర్యాల రోడ్డుపై బీర్సాయిపేట పెద్దచెరువు వద్ద రోడ్డుపై గుంతలు



అధ్వానంగా మారిన రోడ్డుపై ప్రయాణిస్తున్న బస్సులు

రోడ్లు ఇలా.. రాకపోకలు ఎలా?

(5వ పేజీ తరువాయి...)

ఇబ్బందులు తప్పడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

ఉట్నూర్ మండలంలోని లింగోజి తండా నుంచి హనుమాన్ ఘాట్ వరకు ఉన్న ఎనిమిది కిలోమీటర్ల రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.2.50 కోట్లు మంజూరు చేసి టెండర్లు పిలిచినప్పటికీ.. ఐదేళ్లుగా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని రోడ్లు భవనాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు ఈ రోడ్డు నిర్మాణం పనుల కోసం ఏడుసార్లు టెండర్లు పిలవడం జరిగిందని, అయినా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. రోడ్లు భవనాల శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదు. దీంతో ఒకవేళ పనులు చేస్తే బిల్లులు ఎప్పుడు వస్తాయో? తెలియదని, అందుకే ముందుకు రావడం లేదని కాంట్రాక్టర్లు సైతం పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు ఉన్న కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేసి కొత్త పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటేనే రోడ్లు బాగుపడతాయని పరిశీలకులు అంటున్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి
: రాథోడ్ రితేష్, బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు



లింగోజితండా ఎక్స్‌రోడ్డు నుంచి ఆసిఫాబాద్ వెళ్లే రహదారికి, ఉట్నూర్ నుంచి మంచిర్యాల వెళ్లే రహదారికి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రతీ నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డుల గుండా రాకపోకలు సాగిస్తున్నా.. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. దీంతో మరమ్మతులు జరగడం లేదు. గత ప్రభుత్వంలో నిధులు విడుదల కాక ఇబ్బందులు పడ్డ కాంట్రాక్టర్లు.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే టెండర్లు పిలిచి ఆసిఫాబాద్, మంచిర్యాల రోడ్లకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

తక్షణ మరమ్మతుల కోసం రూ.10 లక్షలు మంజూరు
: మనీష్, ఆర్అండ్‌బీ ఏఈఈ, ఉట్నూర్

ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్(ఎఫ్‌డీఆర్) ద్వారా కలెక్టర్ రూ. 10 లక్షలు మంజూరు చేశారు. దీనిలో భాగంగా ఉట్నూర్ నుంచి బీర్సాయిపేట రోడ్డు మరమ్మతులకు రూ.5 లక్షలు, అదేవిధంగా ఉట్నూర్ ఎక్స్ రోడ్డు నుంచి ఆసిఫాబాద్ రోడ్డులో ఘాట్ వరకు రూ.5 లక్షలు మరమ్మతుల కోసం మంజూరు అయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలు అంతటా తగ్గుముఖం పట్టాక మరమ్మతు పనులు తప్పకుండా చేపడతాం.



గుంతలు పడ్డ రోడ్డు

కాలువలా గుంతల రోడ్డు

» ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకోని అధికారులు

లోకేశ్వరం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ గ్రామం నుంచి ముథోల్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. బస్టాండ్‌కు సమీపంలో ఉన్న రోడ్డు పరిస్థితి ఇలా మారి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షపు నీరు ధాటికి రోడ్డు తెగి కావువలా మారడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. గ్రామంలోని ప్రధాన రోడ్డుపై ఇంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. కొత్త వారు ఎవరైనా ఈ రోడ్డు వెంబడి ప్రయాణిస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో సోయా కొనుగోలు టోకెన్ల జారీ

» పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రావు

లోకేశ్వరం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లోకేశ్వరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సోయా కొనుగోలు టోకెన్లను సోమవారం పుష్పూర్ క్లస్టర్‌లోని హద్గాం, పొట్టపల్లి, పుష్పూర్, రాయపూర్ కాండ్లీ, సాత్‌గాం గ్రామాల రైతులకు రైతు వేదికలో మాత్రమే జారీ చేయడం చేస్తామని చైర్మన్ రత్నాకర్ రావు తెలిపారు. మిగతా క్లస్టర్ వారికి మంగళవారం నుంచి జారీచేస్తామని చెప్పారు. రైతులు ఈ విషయాన్ని గమనించగలరని కోరారు. అదేవిధంగా రైతులు టోకెన్ల కోసం వచ్చేటప్పుడు తమవెంట పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ పుస్తకాల జిరాక్స్‌లు తేవాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి సారథ్యంలో నడుస్తున్న ప్రజాపాలనను చూసి ఇతర పార్టీల నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. ఆదివారం లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు నక్కల దినేష్, నాయిడి రవి ఆధ్వర్యంలో యువకులు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మండల అధ్యక్షు డు రాజేశ్వర్, నగేష్, ఓస రాజేశ్వర్, ప్రతాప రెడ్డి పాల్గొన్నారు.



కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు

అంగన్‌వాడీ టీచర్‌ను సస్పెండ్ చేయాలి

» టీచర్ నిర్లక్ష్యంపై వేణునగర్ గ్రామస్థుల ఆందోళన

పెంబి, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల కోసం తవ్విన పిల్లర్ల గుంతలో పడి ఓ చిన్నారి మృతికి కారణమైన అంగన్‌వాడీ టీచర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేస్తూ మండలంలోని వేణునగర్ గ్రామస్థులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో శ్రీలత అక్కడికి చేరుకొని గ్రామస్థులతో మాట్లాడారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, కుటుంబసభ్యులు అంగన్‌వాడీ టీచర్ నాగలక్ష్మిని సస్పెండ్ చేయాలని సీడీపీవో వినతిపత్రం అందించారు. చిన్నారి మృతికి కారణమైన టీచర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సై హన్మాండ్లుకు సైతం ఫిర్యాదు అందజేశారు. టీచర్ స్థానికంగా ఉండి, పిల్లల భద్రతను పర్యవేక్షించకపోవడమే ఈ దుర్ఘటనకు ప్రధాన కారణమని వేణునగర్ గ్రామస్థులు మండిపడుతున్నారు. చిన్నారి తల్లిదండ్రులకు నష్టపరిహారం అందించాలని, అలాగే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా ఇప్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సీడీపీవో శ్రీలత మాట్లా డుతూ ఫిర్యాదును జిల్లా అధికారులకు అందజేస్తానని, అంగన్‌వాడీ టీచర్‌పై చర్యలు తీసుకునేందుకు రిపోర్ట్ చేస్తామని తెలిపారు.



సీడీపీవోకు వినతిప్రతం అందజేస్తున్న గ్రామస్థులు



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

కల్లుగీత వృత్తి రక్షణకు ఐక్యతతో ఉద్యమిద్దాం

» మోకుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్



మాట్లాడుతున్న అమరవేణి నర్సాగౌడ్

భైంసా, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థులందరూ కల్లుగీత వృత్తి రక్షణ కోసం పార్టీలకు అతీతంగా ఐక్యతతో ఉద్యమించాలని మోకుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్రచైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలోని సరస్వతీ గౌడ సంఘం భవనంలో జరిగిన గౌడజన హక్కుల పోరాట సమితి, మోకుదెబ్బ జిల్లా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వీడీసీ వేధింపులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అనంతరం మోకుదెబ్బ రాష్ట్ర కోశాధికారి జి.మురళిగౌడ్, రాష్ట్ర ప్రతినిధులు పి.రాజేందర్ గౌడ్, టి.వెంకట్ గౌడ్, వై.దశాగౌడ్‌లు పాల్గొని మాట్లాడారు.

ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

మోకుదెబ్బ జిల్లాఅధ్యక్షుడిగా కుభీర్‌కు చెందిన చేవూరి కనకగౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ముష్కం అశోక్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రతినిధులు బిల్లోల శరత్ గౌడ్, నక్కల బాబ గౌడ్, లింగాల కృష్ణగౌడ్, పాతూరి రవి గైడ్, కొండ కృష్ణ గౌడ్, బొడ్డు రాజుగౌడ్, కొండ సతీష్ గౌడ్,ముత్యపువార్ నరేష్ గౌడ్,తాళ్లపెల్లి రమేష్ గౌడ్‌లతో పాటు మోకుదెబ్బ కార్యవర్గ ప్రతినిధులు, సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్

కుభీర్,నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గల నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దశాబ్దాల క్రితం అప్పగి గ్రామ జనాభాకు అనుకూలంగా నిర్మాణం చేపట్టారు. ఇది పూర్తిగా శిథిలావస్థకు చేరిన పెచ్చులు ఊడి పడి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. అయినా ప్రతీరోజు ఆట్యాంకులో గ్రామ పంచాయతీ సిబ్బంది మిషన్ భగీరథ నీటిని ఎక్కించి సరఫరా చేస్తున్నారు. పెచ్చులు ఊడి ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ట్యాంకు కూలకముందే ఎన్ని రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు అనేది అధికారులు నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న వాటర్ ట్యాంక్ ఇదే..



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం

కుంటాల, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది. ఈ సందర్భంగా ఉదయం నుండే గ్రామస్తులతో పాటు పక్క గ్రామాల ప్రజలు సైతం గజ్జలమ్మ ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

'ముదిరాజ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలి'

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. జిల్లాకేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ముదిరాజ్‌లు గత శతాబ్దాల నుంచి వారసత్వంగా వస్తున్న భీమన్నగుట్టపై సర్వే నెంబర్ 530లోని సుమారు 60 ఎకరాలలో కుల వృత్తి అయిన పండ్ల పెంపకాన్ని చేసుకొని జీవనం గడుపుతున్నారు. ఇదేఅంశమై 2003లో పార్లమెంట్ సభ్యుల చొరవతో ముదిరాజ్ నాయకుల అభ్యర్థన మేరకు 2003లో మండల రెవెన్యూ అధికారి సర్వే చేసి 530లోని 63ఎకరాల స్థలం ముదిరాజ్‌లకు సంబంధించిందని ఉత్తర్వులను కూడా ఇచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నిర్మల్ జిల్లా యువజన నాయకులు పాతర్ల హరీష్ ముదిరాజ్, చందు, రోహిత్ పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా పేట అధ్యక్షుడిగా అంబాజీ

దిలావర్‌పూర్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా పీఈటీ అసోసియేషన్ (పేట) అధ్యక్షుడిగా దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గుగ్లావత్ అంబాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో అంబాజీని తమ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన మాజీ మంత్రి

నిర్మల్ రూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సర్పంచ్ రావుల ముత్యం రెడ్డిని ఆదివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పరామర్శించారు. డాక్టర్ని అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వీరితోపాటు పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, మాజీ ఆత్మచైర్మన్ గంగారెడ్డి, మాజీఎంపీటీసీ గంగాధర్, మాజీకౌన్సిలర్ నరహరి, బీసీసంఘం అధ్యక్షుడు భాస్కర్ ఉన్నారు.

మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు చర్యలు

» బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ రూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంజులాపూర్‌కు చెందిన గుల్లె వినయ్ ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి ప్రమాదవశాత్తు నెల రోజుల క్రితం దుబాయ్‌లో మృతి చెందడంతో స్థానిక నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి విన్నవించారు. దీంతో మహేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించి మృతదేహాన్ని స్వదేశానికి రప్పించడం కోసం ఎన్నారై సెల్ అధికారులతో, విదేశాంగ శాఖ అధికారులతో మాట్లాడారు. మృతదేహాన్ని స్వదేశానికి పంపించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈమేరకు సోమవారం మృతదేహం భారత్‌కు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో బాధిత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పజెప్పనున్నట్లు తెలిపారు.

ఆర్యవైశ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

» హాజరైన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ రూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో పట్టణ ఆర్యవైశ నూతనకమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆమెడ శ్రీధర్‌తోపాటు కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్యులు పార్టీలకు అతీతంగా రాజకీయంగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు, తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ ప్రక్షాళన కమిటీ చైర్మన్ మిరుదొడ్డి శ్యామ్, వైస్ చైర్మన్ యాద నాగేశ్వర్ రావు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు గాదె విలాస్ గుప్తా, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గాజుల పండుగ

నిర్మల్‌రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జుమ్మేరాత్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007-08 బ్యాచ్ మహిళలు ఉత్సాహంగా గాజుల పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు గాజులు వేసుకొని గోరింటాకు పెట్టుకున్నారు. ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ రూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బర్కత్‌పురా, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేడు కదిలిలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

దిలావర్‌పూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ క్షేత్రం శ్రీ మాతాన్న పూర్ణేశ్వరి కదిలి పాపహరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సామూహిక వ్రతోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ వెంకట్ రావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో కలిసిన పూర్వవిద్యార్థులు

నిర్మల్‌రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండల కేంద్రంలోని గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో 1981-82 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని సిటీ కన్వెన్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనంలో వారు సమావేశమయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఒకరి యోగక్షేమాలు ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం వార్షికోత్సవం జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మార్కంటి జీవన్, ముత్యం, వెంకన్న, కిరణ్, బలాష్టు రాజేశ్వర్, నరేష్, కిరణ్, సాగర్, కిషన్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళ సాధికారతే లక్ష్యం


వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు

ఉట్నూర్, నవంబర్2 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని వార్ధా జిల్లాలో ఉన్న సేవా గ్రాం మహాత్మాగాంధీ ఆశ్రమంలో మహిళా సాధికారతే లక్ష్యంగా శిక్షణ కొనసాగిందని పలువురు వక్తలు అన్నారు. శిక్షణ శిబిరంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘఢ్, జార్ఖండ్, బీహార్,మణిపూర్ తదితర రాష్ట్రాల నుంచి ప్రముఖ మహిళ నాయకులు పాల్గొన్నారన్నారు. శిక్షణ కార్యక్రమాలు ఎంతో ప్రేరణాత్మకంగా, మార్గదర్శకంగా ఉన్నాయని ఆత్రం సుగుణక్క ఈ సందర్భంగా తెలిపారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలి : బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ రెండూ దగా పార్టీలేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ఆదివారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని రహ్మత్‌నగర్, కార్మిక్‌నగర్ ఇతర బస్తీల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్రజలను ఓట్లు అడిగే ముందు ఇక్కడ రెండుగంటలు పాదయాత్ర చేయాలని, ప్రజలు ఏం చెబుతారో చూడాలని సవాల్ చేశారు. జూబ్లీహిల్స్‌లో డ్రైనేజీ, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని విమర్శించారు. మజ్లిస్ అసదుద్దీన్


జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

చెప్పినట్లుగా కాంగ్రెస్ పనిచేస్తోందని, వారి మెప్పు కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చారని ఆరోపించారు. ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమన్నారు.

తెప్పపై ప్రమాదకర ప్రయాణం

- రైతులకు తప్పని తిప్పలు
- కూలిన వంతెనతో ప్రయాణ భారం
- పట్టించుకోని అధికారులు, నాయకులు
- బూరుగుపల్లి (కే) వాసులకు కష్టాలు

నర్సాపూర్(జి), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో రైతులు తమ పొలాలకి వెళ్లడానికి ప్రమాదకరంగా తెప్పలు ఉపయోగిస్తున్నారు. రైతులు తెప్పలపై (థర్మకోల్ పడవలపై) తమ ప్రాణాలను పనంగా పెడుతున్నారు. దీనికి కారణం రెండు సంవత్సరాల క్రితం కూలిపోయిన ఒక వంతెన (బ్రిడ్జి).

3 కిలో మీటర్ల పనికి... 20 కిలోమీటర్ల ప్రయాణం...

కల్లూర్, మోతక్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న ఈ వంతెన శిథిలావస్థకు చేరి, పూర్తిగా కూలిపోయింది. బూరుగుపల్లి(కే) గ్రామం నుంచి మోతక్‌పల్లి వెళ్లాలంటే ఈ వంతెన మీదుగా వెళ్లాలి. కానీ అది కూలిపోవడంతో, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తన వ్యవసాయ పనుల కోసం పొలంలోకి వెళ్లాలంటే సాధారణంగా 3 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే సరిపోతుంది. కానీ వంతెన లేకపోవడంతో ఇప్పుడు నేను సుమారు 20 కిలో మీటర్ల దూరం చుట్టూ తిరగాల్సి వస్తుందని రైతు కళ్యాణ్‌కర్ వెంకట్ రావు, బూరుగుపల్లి(కే) గ్రామస్థుడు వాపోయాడు. ఈ అదనపు ప్రయాణం వలన సమయం, ధనం వృథా అవుతున్నాయన్నాడు.

ధైర్యమే ఆయుధం...

పరిష్కారం దొరకక, రైతులు విచిత్రమైన అత్యంత ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకున్నారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లడానికి వారు చేపలు పట్టేందుకు వాడే థర్మకోల్‌తో చేసిన తెప్ప (బోట్)లను ప్రయాణ మార్గాలుగా ఉపయోగిస్తున్నారు. నూతన మండలం ఏర్పడినా సమస్యలు తీరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోట్‌పై వెళ్తుంటే అరచేతుల్లో ప్రాణం పెట్టుకుని వ్యవసాయం చేసుకుంటున్నామని వెంకట్ రావు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు ఎంతో మంది మారారని, ఎన్నో హామీలు ఇచ్చారని, ప్రతి గ్రామం నుంచి జిల్లాకు వెళ్లే విధంగా రహదారులు ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే నాధుడే లేడని, నూతన మండలం ఏర్పడినప్పటి నుంచి ఈ సమస్యలు ఉన్నా తమ మొర ఆలకించే నాధుడే కరువయ్యాడన్నారు.


తెప్పపై ప్రయాణిస్తున్న రైతులు

గ్రామ పంచాయతీకి అదనపు భారం...

ఈ రవాణా సమస్య కేవలం రైతులకే కాదు. స్థానిక పరిపాలనకు కూడా కష్టాలు తెచ్చిపెడుతోంది. చాక్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న అనుబంధ గ్రామం మోతక్‌పల్లి నుంచి చెత్త సేకరించాలంటే గ్రామ పంచాయతీకి అదనపు భారం అవుతోంది. ఈ దూరాన్ని తగ్గించడానికి, మోతక్‌పల్లిని చెత్త సేకరణ కోసం పక్క గ్రామ పంచాయతీకి విలీనం చేయాలని స్థానికులు కోరుతున్నారు. నూతన మండలం ఏర్పడినా, రోడ్లు, వంతెనలు వంటి కనీస మౌలిక వసతులు లేకపోతే ప్రజల కష్టాలు తీరేలా లేవు.

పంటను అమ్ముకునేందుకు పాట్లు

- వర్షాలకు కాపాడుకోలేక తీవ్ర ఇబ్బందులు
- బాసర, ముథోల్ రైతులకు తప్పని కష్టాలు

బాసర, నవంబర్ 02(ఆంధ్రజ్యోతి):మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట చేతికొచ్చి నెల రోజులు గడిచిన తర్వాత ప్రారంభించిన కేంద్రాల వద్ద సరైన ఏర్పాట్లు లేక ఘర్షణ వాతావరణ నెలకొంది. కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం కావడంతో రైతులు పంటను అమ్ముకోవడానికి పోటీ పడుతున్నారు. ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ముఖ్యంగా కుబీర్ మండలంలోని కొనుగోలు కేంద్రం వద్ద టోకెన్ల కోసం పెద్దఎత్తున రైతులు రావడంతో తోపులాట జరిగింది. జిల్లాలో చాలాచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.

బాసరకు అన్యాయం... ముథోల్‌కు నిరాశ

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులోనూ వివక్ష చూపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోయాబీన్ పంట ఎక్కువ విస్తీర్ణంలో పండించే బాసర మండలంలో ఆదివారం వరకు ఒక్క కొనుగోలు కేంద్రం కూడా ఏర్పాటు చేయకపోవడం రైతుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ముథోల్ మండలంలో రెండు కేంద్రాలు ఉండగా, ఈసారి కేవలం బోరేగాం గ్రామానికే పరిమితం చేశారు. "ప్రతి సంవత్సరం ముదోల్‌లోనే ప్రధాన కేంద్రం ఉండేది. ఇప్పుడు రాజకీయ ఒత్తిళ్లతో బోరేగాం వైపు మళ్లించారు. తాము బాసర నుంచి భైంసా వరకు పాదయాత్ర చేశాం కాబట్టి తమను విస్మరించారు" అని రైతులు మండిపడుతున్నారు.

కేంద్రాల వద్ద తోపులాట, మహిళా రైతులకు గాయాలు

ఒకపక్క ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు ఉరుకులు పరుగులు పెడుతుంటే, మరో పక్క కొనగోలు కేంద్రాల వద్ద ప్రశాంత వాతావరణం లేకుండా పోయింది. చాలా చోట్ల టోకెన్ల కోసం, తమ పంటను త్వరగా కొనుగోలు చేయాలంటూ రైతులు ఆందోళనలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేంద్రాల సంఖ్య తక్కువగా ఉండటం, టోకెన్ల జారీలో ఆలస్యం, పంట కొనుగోలు ప్రక్రియలో జాప్యం కారణంగా ఈ తోపులాటలు, అవాంచనీయ ఘటనలు జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైన వెంటనే రైతులు పంట అమ్మకానికి గుంపులుగా చేరి టోకెన్ల కోసం తోపులాటకు దిగారు. కుబీర్ మండల కేంద్రంలో జరిగీన తోపులాటలో పలువురు మహిళా రైతులు స్వల్ప గాయాలపాలయ్యారు.


అమ్ముకోవడానికి సిద్ధంగా ఉన్న సోయపంట

ఆలస్యంతో దళారులకు అమ్ముకున్న రైతులు

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జరిగిన జాప్యం కారణంగా చాలా మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. వానల నుంచి పంటను రక్షించుకోలేక, నిల్వ చేసుకునే సౌకర్యం లేక, ముఖ్యంగా యాసంగి పంట పెట్టుబడి అవసరాల కోసం చాలా తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సి వచ్చింది.

కొనుగోలు కేంద్రాలు పెంచాలి...

● ఆనంద్ బండారి, బీకేఎస్ రైతుసంఘం నాయకులు

కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం కావడంతో రైతులకు ఆందోళనగా ఉంది. కేంద్రాలు తక్కువగా ఉండడం వల్ల సమస్య తలెత్తుతుంది. అధిక విస్తీర్ణం ఉన్న బాసర మండలంలో కేంద్రం ఏర్పాటు చేయకపోవడం, ముథోల్‌మండలంలో ఒకటే కేంద్రాన్ని మండల కేంద్రంలో కాకుండా ఏర్పాటు చేయడం ఇక్కడి రైతుల పై అధికారులు వివక్ష చూపెట్టినట్లుంది.

స్వర్ణకారుల బతుకు ఆగమాగం

- పెరుగుతున్న బంగారం ధరతో ఇబ్బందులు
- కొనుగోలు తగ్గిందంటున్న స్వర్ణకారులు

బోథ్, నవంబర్2 (ఆంధ్రజ్యోతి): స్వర్ణకారుల బతుకు ఆగమైంది. రోజు రోజుకు బంగారం ధరలు పెరిగి పోతుండడంతో గతంలో బంగారం కొనుగోలు చేసి నిల్వ ఉంచుకున్న వారికి లాభదాయకమే అయినా కొత్తగా కొనుగోలు చేసేవారు జంకుతున్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుంటే సామాన్య ప్రజానీకానికి బంగారం భవిష్యత్తులో అందకుండా పోతుందేమోనన్న కంగారు మొదలైంది.

బ్యాంకుల్లో పెరుగుతున్న నిల్వలు...

వివిధ బ్యాంకుల వారు బంగారం పైన రుణాలు విరివిగా ఇస్తుండడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో తమ బంగారాన్ని తాకట్టు పెట్టి పంట పెట్టుబడులు పెట్టుకుంటున్నారు. అయితే చేతిలో చిల్లిగవ్వ లేక బయట అప్పులు పుట్టక తమ వద్ద ఉన్న బంగారాన్ని బ్యాంకుల్లో తాక ట్టు పెట్టు కుంటున్నారని పరిశీలకులు పేర్కొంటున్నారు. అధిక వర్షాల వల్ల రైతులకు అప్పులు ఇచ్చేవారు సైతం వెనుకడుగు వేస్తున్నారు. దీంతో రైతుల వద్ద ఉన్న బంగారాన్నంతా తాకట్టులో పెట్టుకుంటున్నారు. దీంతో బ్యాంకులో భారీగా బంగారం విలువలు పెరిగి పోతున్నాయని అంటున్నారు.


స్వర్ణకారుడు

సామాన్యుల సతమతం....

రోజు రోజుకు బంగారం ధరలు పెరగడంతో సామాన్య జనం బంగారం కొనుగోలు అంటేనే జంకుతున్నారు. బంగారం ధరలు సామాన్యునికి అందక పోవడంతో బంగారం కొనాలంటే ఆచితూచి వ్యవహరిస్తున్నారు. గత మూడు రోజులుగా బంగారం ధరలు పెరగడం తగ్గడం మార్కెట్లో ఒడిదుడుకులు ఉండడంతో కొనుగోలుకు ధైర్యం చేయడం లేదు.

గిరాకీ లేదు..

బంగారం ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్యులు బంగారం కొనుగోలు చేయక పోవడం వల్ల స్వర్ణకారులకు గిరాకీ లేకుండా పోయింది. ఫలితంగా స్వర్ణకారుల కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోతున్నాయి. స్వర్ణకారుల జీవితాలు దినదిన గండంగా మారుతున్నాయని వారు వాపోతున్నారు.

తుర్కం చెరువుకు పర్యాటకుల తాకిడి


చెరువు వద్ద పర్యాటకులు

మామడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్దుర్తి అటవీ ప్రాంతంలో గల తుర్కం చెరువు ఏకో టూరిజం ప్రాంతాన్ని ఎన్‌జీవో సంస్థ హైదరాబాద్ వారు ఈ శని, ఆదివారాల్లో సందర్శించారు. వారు టూరిజం సర్క్యూట్ నందు వివిధ రకాల పక్షులను, సీతాకొక చిలుకలను, అటవీ జంతువులను తమ వెంట తెచ్చుకున్న కెమెరాలో బంధించారు. ఈ ప్రాంతంలో గల భీమన్న ఆలయాన్ని సందర్శించారు. తుర్కం చెరువులో రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం తుర్కం చెరువు నుంచి వెంగన్న చెరువు వరకు ఫారెస్ట్‌లో సఫారీ వాహనంలో అటవీ అందాలను చూస్తూ బాగుంది అంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ రావు, ఎఫ్ఎస్‌వోలు అన్న పూర్ణ, శ్రీనివాస్, బీట్ అధికారులు పాల్గొన్నారు.


నల్దుర్తి తుర్కం చెరువులో పక్షులు

ఆదిలాబాద్ జిల్లాలో జాగృతిబాట

- రెండు రోజుల పాటు సాగనున్న కల్వకుంట్ల కవిత పర్యటన
- ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండా

ఆదిలాబాద్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాగృతి జనం బాట పేరిట కల్వకుంట్ల కవిత పర్యటన ఆదిలాబాద్ జిల్లాలో రెండు రోజుల పాటు సాగనుంది. బీఆర్ఎస్‌ను విడిచి కవిత జాగృతితో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత తొలిసారిగా జిల్లాలో పర్యటించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. స్థానికంగా నెలకొన్న ప్రజాసమస్యలు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పరిశీలించడంతో పాటు... మేధావులు, సాహితీ వేత్తలతో సమావేశాల నిర్వహణతో పర్యటన సాగనుంది. ఇటీవల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వేణుగోపాల్ యాదవ్ పార్టీని విడిచి కవిత సమక్షంలో జాగృతిలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. ఇప్పటికే భారత జాగృతి కింద దాదాపు పదేళ్ల నుంచి కవిత మార్గదర్శకత్వంలో పని చేస్తున్న నేతలు, కొత్తగా చేరుతున్న నాయకులతో సమన్వయం కుదురుతుందా అన్న చర్చ కొనసాగుతోంది. ఇక పర్యటనలో తొలిరోజైన సోమవారం ఉదయం మావల వద్ద కల్వకుంట్ల కవితకు శ్రేణులు స్వాగతం పలకనున్నాయి. స్థానిక మార్కెట్ యార్డ్ సందర్శించి రైతులతో ముఖాముఖి జరుపనున్నారు.

వెడ్మరాము వర్ధంతి

ఇచ్చోడ, నవంబరు, 2 (ఆంధ్రజ్యోతి) : ఇచ్చోడ మండల కేంద్రంలో ఆదివారం వెడ్మరాము వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెడ్మరాము చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ రాష్ట్ర అధ్యక్షుడు మర్సకోల తిరపతి, ప్రధాన కార్యదర్శి కోడప నగేష్, ఆత్రం మహేందర్, రవి, విఠల్, శేఖర్, రమేష్, తులసీరాం, మురళీకృష్ణ, సంతోష్, రాములు, భీంరావ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

యువకుడి ఆత్మహత్య

బోథ్, నవంబర్2 (ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి చెందిన సంఘపు సాయికుమార్ (27) సంవత్సరాలు అనే యువకుడు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు బోథ్ ఎస్సై శ్రీసాయి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతునికి గత ఏడు సంవత్సరాల కాలంగా తీవ్రమైన మోకాలి నొప్పులతో పాటు వివిధ రకాల వ్యాధులతో సతమతమవుతున్నాడని భార్య సంగెపు అనుసూయ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఎవరు లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకున్నాడన్నారు. అసుపత్రికి తరలించగా మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారేగాం

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

ముథోల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ మండలంలోని కారేగాం గ్రామంలో ఎల్లమ్మ ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, ఆలయ నిర్వాహకుల కథనం ప్రకారం... ఎల్లమ్మ ఆలయం తాళం పగులగొట్టి అమ్మవారి మెడలో ఉన్న మంగళ సూత్రం, వెండి కన్నులతో పాటు అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, రెండువేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. అలాగే ఆలయం ఎదుట ఉన్న హుండీని దొంగలు తాళం పగులగొట్టి చోరీకి ప్రయత్నించినప్పటికీ హుండీ తెరుచుకోలేదు. దీంతో వదిలి వెళ్లిపోయారని గ్రామస్థులు తెలిపారు.

బావిలో పడి ఒకరి మృతి


ఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్

ఖానాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు మృతి చెందిన ఘటన ఖానాపూర్ మండలంలోని రామిరెడ్డి పల్లె గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... కడెం మండలంలోని ఉడుంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల గండి రాంపూర్ గ్రామానికి చెందిన గాదె నరేష్ (22) అనే యువకుడు కొద్ది రోజులుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. కొద్ది రోజుల క్రితం ఖానాపూర్ మండలంలోని రామ్‌రెడ్డి పల్లెలో గల తన సోదరి ఇంటికి వచ్చాడు. గత నెల 31వ తేదీన ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన నరేష్ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని ఆచూకీ కోసం వెతికారు. కాగా గ్రామ శివారులోని అడ్స లక్ష్మారెడ్డి మామిడి తోటలో గల వ్యవసాయ బావిలో ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని ఎస్సై రాహుల్ గైక్వాడ్ పరిశీలించారు. కాగా ప్రమాదవశాత్తు యువకుడు బావిలో పడి మరణించాడా మరేదైనా జరిగి ఉంటుందా అనే దానిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోస్టుమార్టం నివేదిక వస్తే పూర్తి వివరాలు తేలుతాయని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

ఇంద్రవెల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఇసాయన్న హెచ్చరించారు. ఆదివారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పాటగూడ గ్రామ శివారులో కుమ్ర భీంరావ్ (48) అనే వ్యక్తి తన అమ్మ పేరు మీద ఉన్న వ్యవసాయ చేనులో మొక్కజొన్న, పత్తి, కంది పంటలో అంతర పంటగా 20 గంజాయి మొక్కలను సాగు చేస్తుండగా పక్క సమాచారంపై పోలీసుసిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. వీటిని సాగు చేస్తున్న కుమ్ర భీంరావ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

సారంగాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల బీరవెల్లిలో ఆదివారం సయ్యద్ సహద్ అనే బాలుడిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. నిర్మల్ పట్టణంలోని గాజులపేట్‌కు చెందిన సధిర్ జుబేర్ దంపతుల కుమారుడైన సయ్యద్ సహద్‌లు బీరవెల్లి గ్రామములో వాజిద్ అనే బంధువుల ఇంటికి వచ్చిన సమయంలో బాలుడిపై కుక్కల దాడి చేయడం వల్ల ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కోసం హైదరాబాద్ పట్టణానికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com



ఘనంగా చిలుకు ద్వాదశి

కుంటాల, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కుంటాలలో గల ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో చిలుకు ద్వాదశి, క్షీరాబ్ది ద్వాదశిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో తులసి దామోదరిని కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు, గ్రామస్థులు దేవాలయంలో ఒడిబియ్యం, పండ్లు, పూలు తదితర వాటిని సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తేమ పేరుతో రైతులను వేధించొద్దు

- ధాన్యంలో కోత విధిస్తే రైస్‌మిల్ సీజ్
- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

ముథోల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): తేమ పేరుతో రైతులను వేధించొద్దని, ధాన్యం తూకంలో కోత విధిస్తే రైస్‌మిల్లును సీజ్ చేయిస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం ముథోల్ మండలంలోని ఆష్టా, బ్రహ్మంగావ్, వడ్తాల్, బోరిగాం, కారేగాం, వెంకటాపూర్, చించాల, ఎడ్‌బిడ్, ఎడ్‌బిడ్ తండా, విట్టోలి గ్రామాలలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులతో ఆయన మాట్లాడి కొనుగోళ్లలో ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం రైస్‌మిల్లులకు వెళ్లిన తర్వాత తేమపేరిట కోత విధించడం సరికాదని, రైస్‌మిల్లులో రైతులకు నష్టం జరిగితే రైస్‌మిల్లును సీజ్ చేయిస్తానని స్పష్టంచేశారు. రైతులకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే తనకు, సబ్ కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే త్వరలోనే ముథోల్, గన్నోర, రువ్వి గ్రామాల్లో సైతం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంద్‌రావు పటేల్, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటేష్ గౌడ్, వైస్ ఛైర్మన్ సాయిరాం, తహసీల్దార్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

- ఉమెన్స్ కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌కు ఆర్థిక ఇబ్బందులు
- పేరు మారినా కనిపించని పురోగతి
- మాడ్రన్ ఉపాధి కోర్సులపై నిస్సహాయత
- రెండు కోర్సులతోనే సర్దుబాటు
- ఇతర విభాగాలకు స్థలాల కేటాయింపు
- నీరసిస్తున్న మహిళాభివృద్ధి లక్ష్యం



మహిళా ప్రాంగణానికి నిధుల కొరత

నిర్మల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దుర్గాబాయి మహిళాశిశు వికాస కేంద్రాలు నిధుల కొరతతో నిర్వీర్యం దశకు చేరుకుంటున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహకం అందకపోతుండడంతో నిరంతర శిక్షణ కార్యక్రమాలను నిర్వహించలేకపోతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటి సీఎం ఎన్‌టీ రామారావు మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, శాశ్వత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో 1987లో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటుచేసిన తెలుగుబాల మహిళాప్రగతి ప్రాంగణాలు ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో మసకబారుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. నిర్మల్ జిల్లాకేంద్రంలోని మహిళా ప్రాంగణం నిధుల కొరతతోపాటు ఆశించిన కోర్సులు నిర్వహించలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

కళ తప్పిన ప్రాంగణాలు

ఉమ్మడి పది జిల్లాల్లో 10 మహిళా ప్రాంగణాలను అట్టహాసంగా ప్రారంభించారు. మొదట్లో శిక్షణ కార్యక్రమాలతో ప్రాంగణాలన్నీ కళకళలాడేవి. తెలంగాణ ఏర్పడగానే ఈ ప్రాంగణాల పేర్లను దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రంగా మార్చారు. మొదట ఈ ప్రాంగణాల నిర్వహణ ఆర్థికపరమైన సహకారంతోపాటు మిగతా బాధ్యతంతా స్టేట్ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ పరిధిలో ఉండేది. ఆ తర్వాత ఈ కార్పొరేషన్‌ను తెలంగాణ రాష్ట్రమహిళా సహకార అభివృద్ధిసంస్థ పరిధి కిందికి చేర్చారు. ఈ ప్రాంగణాల ఏర్పాటు కోసం ప్రతీ జిల్లాలో పెద్దఎత్తున స్థలాలను సైతం సేకరించారు. నిర్మల్ లో మొదట 13 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో పరిపాలన భవనంతో పాటు వివిధ రకాల శిక్షణ కోసం వర్క్ షెడ్లను అలాగే హాస్టల్ భవనాన్ని కూడా అప్పట్లో నిర్మించా రు. స్టేట్ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు అప్పటి ప్రభుత్వాలు పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయించేవి. ఎలాంటి నిధుల కొరత లేని కారణంగా అప్పటి మహిళా ప్రాంగణాలన్నీ మహిళలకు పెద్దఎత్తున శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాయి.

ఉపాధి కల్పించిన శిక్షణ కార్యక్రమాలు

టైలరింగ్, ఎంబ్రాయిడరీ, కంప్యూటర్ స్కిల్స్ డెవలప్మెంట్, బేకరీ, బుక్ బైండింగ్, ఆఫీస్ మేనేజ్మెంట్, ఎలక్ట్రికల్ అప్లయిన్సెస్, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణ, డ్రైవింగ్‌లలో శిక్షణ పెద్ద ఎత్తున సాగాయి. వీటికి తోడుగా మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ శిక్షణ కార్యక్రమాలకు కూడా అప్పటి ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ పెద్దఎత్తున ఆర్థికంగా సహకరిం చేంది. అలాగే అంగన్‌వాడీ వర్కర్లకు కూడా వృత్తిపరమైన శిక్షణను కొనసాగించేవి. ఇటు అప్పటి ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్‌తోపాటు డీఆర్డీఏ, బీసీ, ఎస్సీ కార్పొరేషన్లు, ఐటీడీఏ, ఐసీడీఎస్‌లు శిక్షణ కార్యక్రమాలకు తోడ్పాటు నందించే లక్ష్యంతో స్పాన్సరింగ్ చేశాయి.

జిల్లాలు విడిపోవడంతో సమస్య

• విజయలక్ష్మి, పీడీ, మహిళా శిశు వికాస కేంద్రం, చించోలి(బి), నిర్మల్

కొత్త జిల్లాలు ఏర్పాటుతో మహిళా శిశువికాస కేంద్రాలకు ఆయా సంస్థల స్పాన్సరింగ్ తగ్గింది. డీఆర్డీఏ, ఐటీడీఏ, బీసీ కార్పొరేషన్, ఎస్సీ కార్పొరేషన్‌లు గతంలో స్పాన్సరింగ్ చేసేవి. ప్రస్తుతం తమ జిల్లాల్లోనే ఈ సంస్థలు మహిళలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. దూరభారం కావడంతో జిల్లాకేంద్రాల్లోనే శిక్షణలు కొనసాగుతున్నాయి. దీంతో శిక్షణలకు దూరప్రాంత జిల్లాల మహిళలు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న శిక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం.

నిధుల్లేక తగ్గుతూ..

రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిధులను మంజూరు చేయకపోతుండడంతో కేంద్రాల నిర్వహణకు సమస్యగా మారింది. అయితే రోజురోజుకు ఆర్థికపరమైన ఇబ్బందుల కారణంగా మహిళలకు శిక్షణ కార్యక్రమాలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ప్రస్తుతం అటు మహిళా కార్పొరేషన్ నుంచి ఇటు వివిధ కార్పొరేషన్ల నుంచి స్పాన్సరింగ్‌లు తగ్గడంతో ఈ కేంద్రాలు ఒకటి, రెండు శిక్షణలను మినహా మిగతా ఉపాధి శిక్షణలకు దూరమవుతున్నాయంటున్నారు.

ఇతర విభాగాలకు స్థలాల కేటాయింపు

రాష్ట్రంలోని 10 మహిళా శిశువికాస కేంద్రాలకు సంబంధించిన స్థలాలను క్రమంగా ఇతర విభాగాలకు కేటాయిస్తున్నారు. నిర్మల్‌లోని శిశు వికాసకేంద్రానికి మొదట 13ఎకరాలు కేటాయించారు. ఈ కేంద్రాల ప్రాధాన్యత తగ్గడంతో ఇటీవలే అధికారులు మైనారిటీ ఉమెన్స్ కాలేజీ కోసం 6ఎకరాలను ఈస్థలం నుంచే కేటాయించడం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ప్రస్తుతం శిశువికాస కేంద్రానికి కేవలం 7 ఎకరాల భూమి అందుబాటులో ఉండనుంది. అలాగే రాష్ట్రంలోని మిగతా మహిళా శిశువికాస కేంద్రాలకు సంబంధించిన స్థలాలను కూడా ప్రజాప్రయోజనాల కోసం ఇతర విభాగాలకు కేటాయించినట్లు తెలుస్తోంది. మొదట మైనార్టీ ఉమెన్స్ కాలేజీ ఏర్పాటు ప్రతిపాదనపై సర్కారు స్పందించకుండా ఇదే స్థలంలో కోర్టు భవనాల ప్రాంగణాలను నిర్మించాలని తలపెట్టింది. ఊరికి దూరంగా ఉన్న ఈ స్థల కేటాయింపుపై బార్ అసోసియేషన్ సైతం ప్రస్తుతం వ్యతిరేకిస్తోంది. కోర్టుభవనాల నిర్మాణాలకు ఈస్థలాన్ని కేటాయిస్తే కొంతమేర స్థలం మిగలనుంది.

కొత్త కోర్సులు, ఉద్యోగ శిక్షణలకు అనుకూలం

ప్రస్తుతం మహిళా శిశు వికాస కేంద్రాలలో విశాలమైన గదులు, మంచి ఆహ్లాదకరమైన వాతావరణం, అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్న కారణంగా ఇక్కడ మహిళలకు సరికొత్త స్వయం ఉపాధి కోర్సులను అందిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులందరూ రూ.లక్షలు పెట్టి ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. బీసీ, ఎస్సీ స్టడీ సెంటర్ల ద్వారా వీరందరికీ ఇక్కడి మహిళా శిశు వికాస కేంద్రాలలో శిక్షణలు అందిస్తే మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెబుతున్నారు.



దర్శనం కోసం క్యూలో భక్తులు

బాసరకు పోటెత్తిన భక్తులు

- ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

బాసర, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం, ఆదివారం కావడంతో అమ్మవారి క్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేశారు. గోదావరి నదిలో కార్తీకస్నానలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. నదీతీరంలో గల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో గల రెండు మండపాల్లో 554 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు జరిపించుకున్నారు.



ఎంపీడీవోలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

- ఎంపీడీవోలతో మాజీ ఎమ్మెల్యే నారాయణరావ్ పాటిల్

భైంసా, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): కొత్తగా విధుల్లో చేరిన ఎంపీడీవోలు గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పాటుపడాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ సూచించారు. నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన పలువురు చేరిన ఎంపీడీవోలు ఆదివారం భైంసాలో మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్‌ను కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భైంసా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, కుంటాల మాజీ ఎంపీపీ సయ్యాజీ భోజరాం పాటిల్‌ల పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయాధికారికి స్వాగతం పలుకుతున్న అదనపు కలెక్టర్

హైకోర్టు న్యాయాధికారికి స్వాగతం పలికిన అదనపు కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయాధికారికి కే.లక్ష్మణ్‌కు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ స్వాగతం పలికారు. పట్టణంలోని అటవీ వసతిగృహంలో అదనపు కలెక్టర్, న్యాయమూర్తికి పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. న్యాయాధికారికి స్వాగతం పలికినవారిలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, ఏఎస్పీ రాజేష్ మీనా, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఛైర్మన్ సోమ భీమ్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

- ఏఎంసీ ఛైర్మన్ సోమ భీమ్ రెడ్డి

సోన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ఆదివారం సోయాపంట కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణ ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమభీమ్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మద్దతు ధర క్వింటాకు రూ.5,328 చెల్లిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ గంగా దాస్, మండల అధ్యక్షులు మధుకర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

లక్ష్మణచాంద, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంజర్ గ్రామంలో ఆదివారం మహాలక్ష్మి, ముత్యాలమ్మ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపన సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నల్ల లక్ష్మారెడ్డి, ముద్దం రాజారెడ్డి, మోహన్ రెడ్డి, వీడీసీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కల్యాణం కమనీయం

- ఘనంగా శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం
- భారీగా తరలివచ్చిన భక్తజనం



శ్రీనివాసుని పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు



కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

ఖానాపూర్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పద్మావతి నగర్‌లో గల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ 41వ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆదివారం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆదివారం తెల్లవారు జాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. శ్రీవారి పట్టు వస్త్రాలను, తలంబ్రాలను పట్టణ పుర వీధులలో వైభవంగా ఎదుర్కొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద పండితులు శ్రీ చక్రపాణి వాసుదేవాచార్యుల పర్యవేక్షణలో చక్రపాణి నరసింహ మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నిర్వహించిన శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- ఎస్పీ జానకీ షర్మిల
- జిల్లాలో మైనర్ డ్రైవింగ్‌పై తనిఖీలు
- 64 వాహనాలు సీజ్

నిర్మల్‌రూరల్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, వారివల్ల ఏదైనా అనుకోని ఘనట జరిగితే వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాలని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. రోడ్డుప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా ఆదివారం జిల్లవ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ డ్రైవ్‌లో మైనర్ల డ్రైవ్ చేస్తున్న 64 వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. మైనర్లకు, వారి తల్లిదండ్రులు కలిపి మొత్తం 65మందికి స్థానికంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. అంతేకాకుండా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 45 వాహనాలకు రూ. 11,295 పెండింగ్ చలానాలను వసూలు చేసినట్లు తెలిపారు. పిల్లలకు వాహనాలు ఇవొవ్వద్దని, ఒకవేళ ఇస్తే వాహన యజమాని, వారి మైనర్ల తల్లిద్రండులు పూర్తి బాధ్యతను తీసుకోవాలని ఎస్పీ జానకీ షర్మిల ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ తనిఖీల్లో నిర్మల్ జిల్లా ఏఎస్పీ రాజేష్ మీనా, ఇన్‌స్పెక్టర్లు, అన్నిస్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.



కొండాపూర్ వద్ద వాహన తనిఖీ చేస్తున్న ఎస్సై లింబాద్రి



మైనర్ డ్రైవింగ్ తనిఖీలలో పాల్గొన్న ఏఎస్పీ రాజేష్ మీనా



నీటిలోనే ఉన్న కోత దశకు వచ్చిన వరి పంట



లోకేశ్వరంలో నేలకొరిగిన వరి పంటను చూపుతున్న రైతు

అకాల వర్షం - అపార నష్టం

- రెండు రోజులుగా వర్షం
- నీట మునిగిన పంటలు
- ఆందోళనలో రైతులు

లోకేశ్వరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయాగ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లోని వరిధాన్యం తడిసి ముద్దయింది. కంటి మీద కునుకు లేకుండా మొక్కజొన్న, పత్తి, సోయా పంటలను కాపాడుకుంటూ వచ్చిన కష్టం అంతా నీళ్ల పాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగుకోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆలోచనలో రైతులు మథనపడుతున్నారు. తడిసిన పంటలను కొనాలని రైతులు కోరుతున్నారు.

నీట మునిగిన పంటలు

నిర్మల్ రూరల్: మండలంలోని న్యూ పోచంపాడ్, కొండాపూర్ గ్రామాల్లో వరి పంటలు నీట మునిగిపోయాయి. పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దిగుబడులు దెబ్బతినే అవకాశముందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.